RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్


"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. • సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

Dr. RAHUL KUMAR 9989834020
K. Naveen Kumar 94406 53413

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 72 | పేజీలు : 08 | శుక్రవారం | 20-03-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



## రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం...

2

- ఉగాది వేళ రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి
- రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం రేవంత్
- ఈ నెల 22న రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటన
- రూ.2 లక్షల వరకు రుణమాఫీతో రైతులకు ఊరట కల్పించామన్న సీఎం
- ధరణి సమస్యల పరిష్కారానికి భూ భారతిని తీసుకొచ్చామని వెల్లడి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. మార్చి 22వ తేదీన 'రైతు భరోసా' పథకం కింద నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన 'శ్రీ




2

## వందేమాతరం పాడాల్సిందే

ఎంఐఎంపై బండి సంజయ్ ఫైర్

- వందేమాతరం పాడని ఎంఐఎం ఎమ్మెల్యేల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం
- అధికారంలోకి వస్తే వందేమాతరం గీతాన్ని తప్పనిసరి చేస్తామని హెచ్చరిక
- కేరళ ఎన్నికల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని ఆరోపణ
- పెండింగ్ రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్



2

## రిపబ్లిక్ డే వేడుకలు రద్దు!

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్...

- మార్చి 23న జరగాల్సిన పాక్ రిపబ్లిక్ డే వేడుకలు
- రిపబ్లిక్ డే అధికారిక వేడుకలను రద్దు చేస్తున్నట్టు ప్రధాని కార్యాలయం ప్రకటన
- వేడుకలను జెండా ఆవిష్కరణకే పరిమితం చేయాలని ఆదేశాలు

## ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

- ఇంధన అవసరాల తీరేలా సంబంధిత దేశాలతో మాట్లాడుతున్నట్లు వెల్లడి
- పశ్చిమాసియాలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామన్న రణధీర్ జైశ్వాల్
- కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ మాట్లాడారన్న జైశ్వాల్

2




హైదరాబాద్ పల్స్,డెస్క్

ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా పరిణామాలు మన దేశానికే కాకుండా ప్రపంచానికే పరీక్షగా మారాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా

## గ్యాస్, చమురు నిల్వలు ఎంత ఉన్నాయో చెప్పండి

ఇంధన సంస్థలకు కేంద్రం ఆదేశాలు

- ఇంధన అవసరాలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు
- కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటు చేసే ఉద్దేశంతో నోటిఫికేషన్
- పీపీఏసీ వివరాలు అందివ్వాలని కంపెనీలకు ఆదేశం

2







2

## 'శ్రీ పరాభవ నామసంవత్సరం' పై

కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

- పరాభవం అనేది మన దేశానికి కాదన్న కిషన్ రెడ్డి
- భారత్ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు పరాభవం ఎదురవుతుందని వ్యాఖ్య
- పుణ్యభూమి భారతావనికి అన్ని శుభ ఫలితాలే వస్తాయని విశ్వాసం

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఉగాది శోభతో కళకళలాడింది. 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలందరికీ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండితులు వినిపించిన పంచాంగ శ్రవణం అనంతరం కిషన్ రెడ్డి....

## అకాల వర్షాలతో భారీగా పంట నష్టం




2

- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రంలో అకాల వర్షాలతో భారీగా పంట నష్టం
- 1,215 హెక్టార్లలో వ్యవసాయ, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలు ధ్వంసం
- పంట నష్టంపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్ పల్స్,అమరావతి

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1,215 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 267 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## బలపడిన డాలర్...

### భారీగా పడిపోయిన బంగారం

- ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయంతో కుప్పకూలిన బులియన్ మార్కెట్
- డాలర్ కు కలిసొచ్చిన ఫెడ్ నిర్ణయం
- ఒక్కరోజే 8 శాతం పతనమైన వెండి ధర
- 10 గ్రాముల బంగారంపై రూ.6 వేలకు పైగా క్షీణత
- హైదరాబాద్‌లో రూ.1.52 లక్షలకు దిగొచ్చిన తులం బంగారం ధర

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) తీసుకున్న కీలక నిర్ణయం బులియన్ మార్కెట్‌లో ప్రకంపనలు సృష్టించింది. వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతున్నట్లు ఫెడ్ ప్రకటించడంతో డాలర్ విలువ బలపడింది. దీనికి తోడు ట్రెజరీ బాండ్ల రాబడులు కూడా పెరగడంతో,



2

## నా పోరాటం ముగ్గురిపైనే

- జాగృతి కార్యాలయంలో కవిత ఉగాది వేడుకలు
- డాడీ, మోడీ, చిన్న మోడీ (కేటీఆర్)ల పైనే తన పోరాటం అని వెల్లడి
- మంచి ముహూర్తం చూసుకుని పార్టీ ప్రారంభిస్తానన్న కవిత

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు.బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్...

## కవితకు న్యూఢిల్లీ హైకోర్టులో ఊరట

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు న్యూఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. కవిత కొత్తగా స్థాపించనున్న తెలంగాణ ప్రజా జాగృతి పార్టీపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ)ను న్యూఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కవిత కొత్త పార్టీ



తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..
విప్‌ల నియామకం.. 2

పెంపుడు పిల్లి మరణం..
ఆ బాధ తట్టుకోలేకపోయిన యువతి.. 2

# రిపబ్లిక్ డే వేడుకలు రద్దు!

మొదటి పేజీ రువాయి

ఆర్థిక సంక్షోభం కోరల్లో చిక్కుకున్న పాకిస్థాన్, తన ప్రతిష్టాత్మక 'రిపబ్లిక్ డే' (మార్చి 23) వేడుకలపై కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది అధికారిక వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ కార్యాలయం ప్రకటించింది. ఆడంబరాలకు పోకుండా కేవలం జెండా ఆవిష్కరణకే ఈ వేడుకలను పరిమితం చేయాలని నిర్ణయించారు.గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటుతున్న చమురు ధరల నేపథ్యంలో పాక్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. సాధారణంగా అట్టహాసంగా జరిగే సైనిక కవాతు, 31-గన్ సెల్యూట్, భారీ సాంస్కృతిక ప్రదర్శనలను ఈసారి పూర్తిగా నిలిపివేశారు. ప్రభుత్వ శాఖలన్నీ నిరాడంబరంగా వ్యవహరించాలని, అనవసర ఖర్చులకు తావు లేకుండా గౌరవప్రదంగా ఈ సందర్భాన్ని పాటించాలని ప్రధాని ఆదేశించారు.ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరా వ్యవస్థ దెబ్బతిన్న సంగతి తెలిసిందే. దీనివల్ల పాకిస్థాన్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశం తీవ్ర ఆర్థిక అస్థిరతను ఎదుర్కొంటోంది. ఈ విపత్తును తట్టుకోవడానికి మార్చి నెలలో ప్రభుత్వం ప్రకటించిన 'పొదుపు చర్యల'లో భాగంగానే ఈ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి.

# 'శ్రీ పరాభవ నామసంవత్సరం' పై

మొదటి పేజీ రువాయి

మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.కొత్త ఏడాది పేరు 'పరాభవ' అని ఉండటంపై కిషన్‌రెడ్డి ఒక విభిన్నమైన విశ్లేషణ ఇచ్చారు. "పరాభవం అనే పదం మన దేశానికి కానీ, ధర్మాన్ని నమ్మే మన ప్రజలకు కానీ వర్తించదు. ఈ పరాభవం కేవలం భారతదేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులకు, దేశద్రోహులకు మాత్రమే ఎదురవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. పుణ్యభూమి అయిన భారతావనిలో ఈ ఏడాది శుభ ఫలితాలే రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.పండితులు వివరించిన పంచాంగం ప్రకారం... ఈ ఏడాది దేశ భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని, రైతులు సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మాత్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని గుర్తు చేశారు.ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని, తీపి-వగరు-చేదు అన్నీ కలిస్తేనే జీవితమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, 140 కోట్ల మంది భారతీయులు ఐక్యంగా నిలబడితే ఏ సమస్యనైనా అధిగమించవచ్చని అన్నారు.

# నా పోరాటం ముగ్గురిపైనే

మొదటి పేజీ రువాయి

టాపిక్‌గా మారాయి. తన పోరాటం ఎవరితోనో కాదని.. "డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్నమోడీ (కేటీఆర్)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు.బీఆర్ఎస్ పార్టీతో తనకు ఉన్న అంతర్గత విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్టు కవిత మండిపడ్డారు. తన రాజకీయ ప్రయాణం స్వతంత్రంగా ఉంటుందని, ఎవరికీ అడ్వాంటేజ్‌గా మారబోనని ఆమె స్పష్టం చేశారు. "మంచి ముహూర్తం చూసుకుని పార్టీని ప్రారంభిస్తా.. అప్పుడే నా లక్ష్యాలను ప్రజల ముందు ఉంచుతాను" అని ఆమె అన్నారు.మరోవైపు, కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు నేడు సానుకూల తీర్పునిచ్చింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో దాఖలైన దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. దీంతో పార్టీ అధికారిక ప్రకటనకు ఉన్న సాంకేతిక అడ్డంకులు దాదాపు తొలగిపోయినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కవితకు న్యూఢిల్లీ హైకోర్టులో ఊరట

మొదటి పేజీ రువాయి

పేరుపై ఢిల్లీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. సాంకేతిక సమస్యలను సరిదిద్ది మళ్లీ ఈసీఐకి దరఖాస్తు పంపినట్లు కవిత తరఫు న్యాయవాది ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో కవిత కొత్త పార్టీ దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని ఈసీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.జనవరి 23వ తేదీన తన కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఈసీఐకి కల్వకుంట్ల కవిత దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఎ కింద పార్టీ నమోదు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆమె విజ్ఞప్తి చేశారు. మరోవైపు తన పార్టీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో ఆమె పిటిషన్ దాఖలు చేశారు. కవిత దరఖాస్తులో పలు లోపాలు ఉన్నాయని కేంద్ర ఎన్నికల సంఘం ఈ సందర్భంగా వెల్లడించింది.వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో రాజకీయంగా బలోపేతం కావాలని కవిత కృత నిశ్చయంతో ఉన్నారు. అందుకు తగినట్లుగా వ్యూహాత్మకంగా ఆమె అడుగులు వేస్తున్నారు. ఆ క్రమంలో ఈ ఏడాది జనవరి 23వ తేదీన తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన ఎన్నికల సంఘం.. అందులో పలు సాంకేతిక లోపాలు ఉన్నాయని అభ్యంతరం తెలిపింది.దాంతో న్యూఢిల్లీ హైకోర్టును కవిత ఆశ్రయించారు. ఫిబ్రవరి 27వ తేదీన విచారణ సందర్భంగా కవిత దరఖాస్తులో పలు లోపాలు ఉన్నాయని ఆమెకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు ఈసీఐ తరుపు న్యాయవాది ఢిల్లీ కోర్టుకు తెలిపారు. కానీ ఆ రోజు కవిత తరఫు న్యాయవాది కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఈ కేసు మార్చి 19వ తేదీకి వాయిదా పడింది. దాంతో ఈ పిటిషన్ గురువారం మరోసారి విచారించారు.

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ రువాయి

పరాభవ నామ ఉగాది' వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త తెలుగు సంవత్సరాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేస్తున్నామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును 'రాజు'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఇప్పటికే రైతు భరోసా కింద రూ. 18,000 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. రుణభారంతో ఉన్న రైతులకు పెద్ద ఊరటనిస్తూ రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. దేశంలోనే అత్యంత తక్కువ రుణభారం ఉన్న రైతులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 70 శాతం కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ధరణి పోర్టల్‌తో రైతులకు ఎదురైన భూ యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు దాని స్థానంలో 'భూ భారతి'ని తీసుకొచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పునరుద్ఘాటించారు. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్, చమురు నిల్వలు ఎంత ఉన్నాయో చెప్పండి

మొదటి పేజీ రువాయి

దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీల వద్ద ఉన్న నిల్వలు, ఉత్పత్తి, వినియోగం, దిగుమతులకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దేశంలోని చమురు, గ్యాస్ కంపెనీలకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఆందోళన నెలకొంది. దేశంలో ఇంధన, గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పెట్రోల్, సహజవాయువు సరఫరా గొలుసును పర్యవేక్షించేందుకు ఒక కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేసే ఉద్దేశంతో ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కంపెనీలు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ (పీపీఏసీ)కు ఈ వివరాలు అందించాలని సూచించింది.

# ఇరాన్ యుద్ధం దేశానికే కాదు ప్రపంచానికి పరీక్ష సమయం

మొదటి పేజీ రువాయి

చూసుకోవడానికి సంబంధిత దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు.కువైట్ యువరాజుతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని జైశ్వాల్ తెలిపారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల ఫలితంగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా మనదేశానికి చేరుకున్నాయని తెలిపారు.చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకు గాను రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర అధికారులు వెల్లడించారు.

# బలపడిన డాలర్... భారీగా పడిపోయిన బంగారం

మొదటి పేజీ రువాయి

పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి సురక్షిత సాధనాల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఫలితంగా, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. సాధారణంగా భౌగోళిక ఉద్రిక్తతల సమయంలో పెరిగే ఈ లోహాలు, అందుకు భిన్నంగా యూటర్న్ తీసుకోవడం గమనార్హం.దేశీయ మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏప్రిల్ కాంట్రాక్ట్‌లో కిలో వెండి ధర కేవలం ఒక్క రోజులోనే 8 శాతం పతనమైంది. అంటే ఏకంగా రూ. 19,000 నష్టపోయి రూ. 2.29 లక్షలకు చేరింది. బంగారం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. 10 గ్రాముల బంగారం (ఏప్రిల్ డెలివరీ) ధర సుమారు 4 శాతం క్షీణించింది. దాదాపు రూ. 6,000 తగ్గి రూ. 1.46 లక్షల వద్ద ట్రేడ్ అయింది.హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో గురువారం సాయంత్రం నాటికి 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ. 1.52 లక్షలుగా, కిలో వెండి ధర రూ. 2.36 లక్షలుగా నమోదైంది.అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ బంగారం ఔన్సు ధర గతంలో 5,000 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం 4,682 డాలర్లకు దిగివచ్చింది. స్పాట్ వెండి ఔన్సు ధర 70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పుడు బంగారం, వెండి వంటి వడ్డీరహిత ఆస్తులపై పెట్టుబడులు తగ్గుతాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఫెడ్ తీసుకున్న ఈ నిర్ణయం బంగారం, వెండిపై మరింత ఒత్తిడి పెంచిందని వారు వివరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నెలకొన్న అస్థిరత కారణంగా, ఈ ధరల తగ్గుదలను కొనుగోలుకు అవకాశంగా చూడాలా లేక మరింత పతనం కోసం వేచిచూడాలా అనే సందిగ్ధంలో పెట్టుబడిదారులు ఉన్నారు. రాబోయే రోజుల్లో బులియన్ మార్కెట్ గమనం ఎలా ఉంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# వందేమాతరం పాడాల్సిందే

మొదటి పేజీ రువాయి

అసెంబ్లీలో వందేమాతరం ఆలపించే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా జాతీయ గీతాన్ని గౌరవించి, వందేమాతరం పాడాల్సిందేనని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే వందేమాతరం గానాన్ని తప్పనిసరి చేస్తుందని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఐఎం నేతల తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన 'తొక్కుకుంట వచ్చిన' వ్యాఖ్యల వెనుక అంతర్గత రాజకీయాలు ఉన్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత రహస్యంగా మరో పార్టీతో సమావేశమైనందునే సీఎం ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, కేరళ ఎన్నికల ఖర్చుల కోసం తెలంగాణ నుంచి నిధులు తరలిస్తున్నారని, ఈ బాధ్యతను రాహుల్ గాంధీ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి అప్పగించారని సంచలన ఆరోపణలు చేశారు.రైతు సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసాతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ నది ప్రక్షాళనపై మాట్లాడుతూ, గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేయడాన్ని స్వాగతిస్తామని, అయితే పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని సూచించారు.పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ తీసుకుంటున్న నిర్ణయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని చెబుతూ, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యాసంస్థల్లో ఉగ్రవాద మూలాలు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతరం హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


# అకాల వర్షాలతో భారీగా పంట నష్టం

మొదటి పేజీ రువాయి

వ్యవసాయ శాఖ అధికారులతో అమరావతిలో సమీక్ష నిర్వహించారు.కృష్ణా, నెల్లూరు, శ్రీ సత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 16 మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం 2,043 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా 630 హెక్టార్లలో మొక్కజొన్న, 384 హెక్టార్లలో వరి, 200 హెక్టార్లలో మినుము ఉన్నాయని ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలపైనా వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లో 267 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మామిడి, ఆరెంజ్ వంటి పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 307 మంది ఉద్యాన రైతులు నష్టపోయారని ముఖ్యమంత్రికి వివరించారు.ఈ ప్రాథమిక అంచనాలపై స్పందించిన ముఖ్యమంత్రి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని లెక్కించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వాతావరణ మార్పులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. విప్‌ల నియామకం..

మొదటి పేజీ రువాయి




హైదరాబాద్, మార్చి 19 :తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. శాసనసభ, శాసనమండలి రెండింటిలోనూ సమన్వయం కోసం ప్రభుత్వ విప్‌లను నియమిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.శాసనమండలిలో ప్రభుత్వ పక్షాన సభ్యులను సమన్వయం చేసేందుకు ఇద్దరు ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించారు. వారిలో అద్దంకి దయాకర్ (ఎమ్మెల్సీ), బల్మూరి వెంకట్ (ఎమ్మెల్సీ) ఉన్నారు. సభలో కీలక బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు సభ్యులందరూ హాజరయ్యేలా చూడటం వీరి ప్రధాన విధి.పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ వెళ్లకుండా 'విప్' జారీ చేసే అధికారం వీరికి ఉంటుంది. ఈ నియామకాలతో అటు అసెంబ్లీలో, ఇటు మండలిలో ప్రభుత్వానికి బలం పెరగనుంది. ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఈ ఐదుగురు నేతలు కీలక పాత్ర పోషించనున్నారు. ఉమ్మడి నల్గొండ (వీరేశం, అద్దంకి దయాకర్), ఉమ్మడి కరీంనగర్ (విజయ రమణ రావు), ఉమ్మడి మహబూబ్‌నగర్ (యెన్నం శ్రీనివాస్ రెడ్డి) వంటి ప్రాంతాలకు ప్రాధాన్యత లభించిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బల్మూరి వెంకట్ వంటి యువ నేతలకు అవకాశం ఇవ్వడం ద్వారా పార్టీ భవిష్యత్తు నాయకత్వాన్ని ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

# పెంపుడు పిల్లి మరణం.. ఆ బాధ తట్టుకోలేకపోయిన యువతి..

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, మార్చి 19: పెంపుడు పిల్లి మరణం తట్టుకోలేకపోయిన ఓ యువతి ప్రాణాలు తీసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి చనిపోయింది. ఈ సంఘటన హైదరాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటాద్రి నివాస్‌కు చెందిన 20 ఏళ్ల హిమబిందు బీఎస్సీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఆమె రెండేళ్ల నుంచి ఓ పిల్లిని పెంచుకుంటోంది. ఈ నేపథ్యంలో హిమబిందుకు పిల్లితో విడదీయరాని బంధం ఏర్పడింది. ఆమె ఆ పిల్లిని ఇంట్లో సభ్యుడిగా భావించేది.అయితే, అనారోగ్య కారణాల వల్ల కొద్దిరోజుల క్రితం ఆ పిల్లి చనిపోయింది. ఎంతో ప్రేమతో పెంచుకుంటున్న పిల్లి చనిపోవటంతో హిమబిందు తట్టుకోలేకపోయింది. ఈ నెల 18వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హిమబిందును పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు.ఇక, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హిమబిందు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పెంపుడు పిల్లి మరణం తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్న హిమబిందు స్టోరీ స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# హైదరాబాద్‌లో కల్తీ పాల ఉత్పత్తుల రాకెట్ గుట్టు రట్టు: 6గురు అరెస్ట్

- హైదరాబాద్‌లో కల్తీ పాల ఉత్పత్తుల రాకెట్ గుట్టు రట్టు.
- సికింద్రాబాద్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడులు.
- 6 హోల్‌సేల్, రిటైల్ షాపులపై దాడులు, 6 మంది అరెస్ట్.
- 3,892 కిలోల కల్తీ పనీర్, ఖోవా, క్రీమ్, నెయ్యి స్వాధీనం.
- హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, మెయిన్ డెస్క్ :** నగరంలో కల్తీ పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న ఒక ముఠాను ఖైరతాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ మహంకాళి టెంపుల్ సమీపంలో నిర్వహించిన దాడుల్లో 6 హోల్‌సేల్, రిటైల్ షాపులపై పోలీసులు దాడి చేసి, పెద్ద మొత్తంలో కల్తీ పనీర్, ఖోవా, క్రీమ్, నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఖైరతాబాద్ టాస్క్ ఫోర్స్ బృందం సికింద్రాబాద్ మహంకాళి టెంపుల్ పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో భాగంగా 6 హోల్‌సేల్, రిటైల్ షాపులను తనిఖీ చేయగా, కల్తీ పనీర్, కల్తీ ఖోవా, కల్తీ క్రీమ్, కల్తీ నెయ్యి వంటి నాణ్యత లేని ఉత్పత్తులు పెద్ద ఎత్తున బయటపడ్డాయి. ఈ క్రమంలో మొత్తం 3,892 కిలోల డెయిరీ ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితులు నాసిరకం పనీర్‌ను మార్కెట్ ధర కంటే తక్కువకు, కిలోకు సుమారు 280 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ కల్తీ ఉత్పత్తులను నగరంలోని పలు హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ రాకెట్‌ను ఛేదించేందుకు పోలీసులు విస్తృత దర్యాప్తు చేపట్టారు. ఈ కల్తీ నెట్‌వర్క్‌లో ఇంకా ఎంత మంది భాగస్వాములు ఉన్నారో తెలుసుకునేందుకు పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. కల్తీ ఉత్పత్తుల తయారీ, సరఫరాలో ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా ఇలాంటి నాసిరకం ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ దాడులు, అరెస్టుల నేపథ్యంలో నగరంలో కల్తీ పాల ఉత్పత్తుల సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసులు ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేసి, బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
# నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, నారాయణఖేడ్ :** సిర్గాపూర్ మండల పరిధిలోని వసర్ గ్రామ శివారులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ 200 కోట్ల రూపాయలతో మంజూరై గత కొద్ది నెలల క్రితం శంకుస్థాపన చేసుకోవడం జరిగింది. కావున గురువారం నాడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ప్రారంభించడం జరిగింది. ఇట్టి పనులను పరిశీలించిన పనులను ప్రారంభించి స్కూల్ యొక్క మ్యాప్ మరియు డిజైన్లను అధికారులతో మరియు కాంట్రాక్టర్లతో కలిసి పరిశీలించిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు. అనంతరం వారు అధికారులతో మరియు కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే సంజీవరెడ్డి పనులను పరిశీలించి స్థానిక అధికారులు మరియు కాంట్రాక్టర్లతో చర్చించి స్కూల్ నిర్మాణ సైట్ ప్లాన్ ను ఆమోదించారు. ఈ స్కూల్ భవిష్యత్ తరాలకు అభివృద్ధికి మైలు రాయిగా ఉంటుందని చెప్పారు ప్రభుత్వ చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ప్రాజెక్టులు అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే ఉన్నారు. అత్యాధునిక విద్యా సౌకర్యాలు హాస్టల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేస్తారు ఈ ప్రాజెక్టు గ్రామీణ యువత నాణ్య విద్య అందించడానికి రూపొందింది. ఈ యొక్క స్కూల్ నిర్మాణంలో పనులు నాణ్యతతో కూడినవి ఉండే విధంగా చూసుకోవాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఘనంగా ప్రగతి గ్రామ సమైక్య మహిళా దినోత్సవ వేడుకలు

**500 మంది మహిళలతో ఘనంగా వేడుకలు**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి షాబిర్ పాషా, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి**

**విశిష్ట అతిథులుగా వసుంధర షాపింగ్ మాల్ తాటిపల్లి శంకర్ బాబు దంపతులు**

**ఎస్ కే టి జ్యూవెలరీస్ దోసపాటి క్రాంతి**

**డాక్టర్ సాగరిక గైనకాలజిస్ట్ మాతా శిశు ఆస్పటల్ యు పి హెచ్ సి డాక్టర్ నేహా**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గౌతమ్ పూర్ ప్రగతి గ్రామ సమాఖ్య వివో పద్మ ఆధ్వర్యంలో వసుంధర షాపింగ్ మాల్ ఎంజీ రోడ్డు తాటిపల్లి శంకర్ బాబు ఎస్ కె టి జువెలరీస్ విద్యానగర్ దోసపాటి క్రాంతి కొత్తగూడెం వారి సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా సింగరేణి గౌతమ్ పూర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి వసుంధర షాపింగ్ మాల్ అధినేత తాటిపల్లి శంకర్ బాబు దంపతులు ఎస్ కే టి జువెలరీస్ దోసపాటి క్రాంతి మహిళా శిశు సంక్షేమ శాఖ డిస్టిక్ కోఆర్డినేటర్ రూప డాక్టర్ సాగరిక గైనకాలజిస్ట్ మాతా శిశు ఆస్పటల్ రామవరం పెనగడప పిహెచ్సి డాక్టర్ నేహా గౌతమ్ పూర్ సర్పంచ్ కళ్యాణి విద్యానగర్ సర్పంచ్ శాంతి శ్రీ ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున్ రుద్రంపూర్ ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సమానత్వం ఇంటి నుండే ప్రారంభం కావాలని నిరంతరం మహిళను గౌరవించాలని ఇంట్లో మగ పిల్లలను ఆడపిల్లలను సమానంగా చూడాలని వారన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్యా ఉపాధి రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలని ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో మహిళలు కీలక స్థానాలను అధిరోహించాలని వారన్నారు. మాజీ చైర్పర్సన్ సీతా లక్ష్మీ మాట్లాడుతూ భర్త కాపు కృష్ణ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి రావడం జరిగిందని అంతకుముందు టీచర్గా పని చేశానని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పురుషులతో సమానంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్నారని అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యానిర్వహకులు వివోఏ పద్మ రత్నకుమార్ ని అభినందించిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ టిఆర్ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మి.. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ చదివే మహిళ సాధికారతకు ప్రధాన ఆధారమని అమ్మాయిలు చదువు ఆ కుటుంబానికి వెలుగునిస్తుందని తల్లిదండ్రులు తమ కుమార్తెకు పూర్తి స్వేచ్ఛనిస్తూ మంచి విద్యను అందించాలని వారు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వారన్నారు. మహిళల కొరకు ఇందిరా శక్తి అనే కార్యక్రమాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్ని రంగాల్లో మహిళలు ఉండాలని ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని పథకాలు మహిళా చేతుల్లోనూ ఉంటున్నాయని భర్త వంద రూపాయలు ఇవ్వు అనే పరిస్థితి వచ్చిందని మహిళా విజయమని అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డిస్టిక్ కో ఆర్డినేటర్ రూప మాట్లాడుతూ ఈ సంక్షేమ శాఖలో ట్రాన్స్జెండర్ మహిళలు బాలికలు అందరికీ అండగా ఉంటుందని ఎవరైనా మనకు కష్టం వస్తే 181 కి కాల్ చేయవచ్చు అని మీకు ఏ కష్టం వచ్చినా ముందుగా చెప్పుకోవాలని వారు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించిన ప్రగతి గ్రామ సమాఖ్య. గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. అనంతరం వందమంది మహిళలను సన్మానించడం జరిగింది. ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పంచాయతీ మహిళ సెక్రటరీలను శ్వేత మండల సమైక్య సీసీలు చుంచుపల్లి మండల వివో ఏల కు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించిన ప్రగతి గ్రామ సమైక్య. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన ప్రగతి గ్రామ సమాఖ్య అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ఆర్గనైజర్ రత్నకుమార్. ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ కమిటీ సభ్యులు ఉమా సుమ లావణ్య మల్లేశ్వరి మహిళ సాదరిక సభ్యులు అకౌంటెడ్ ప్రియాంక సీసీ రాము రమతిరుపతి ఏపీఎం అబ్దుల్లా యూనియన్ బ్యాంకు మేనేజర్ రాములు ఫీల్డ్ ఆఫీసర్ సిబ్బంది నిహారిక శృతి దేవి స్టాఫ్ నర్స్ ఎస్తేర్ సిపిఐ మహిళా అధ్యక్షురాలు రత్నకుమారి పంచాయితీల మహిళా సెక్రటరీలు జక్కంపూడి షర్మిల వివో ఏలు స్వర్ణ రేఖ రేష్మా రోస్ రమ జయ జాల విజయ కావ్య మై మున్నీసా స్వరూప లక్ష్మి యమునా శ్రీలత లావణ్య సంకీర్తన మహేశ్వరి సరిత అకౌంటెంట్ వింధ్య ఎమ్మెస్ అధ్యక్షురాలు రాజకుమారి. అందర్నీ ఉత్తేజపరిచిన యాంకర్ స్నేహ. డిస్టిక్ కో ఆర్డినేటర్ మోరే రూప వేసిన డాన్స్ అందర్నీ ఆకట్టుకుంది కార్యక్రమం విజయవంతంలో కృషిచేసిన రిపోర్టర్లు రిషి గోపి కిరణ్ శ్రీనివాస్ మేకల జ్యోతి ప్రోగ్రాం లైవ్ అందజేసిన సత్య డిజిటల్ బృందంకి కృతజ్ఞతలు తెలియజేసిన ప్రగతి గ్రామ సమైక్య.

# శ్రీ రామలింగేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామంలో ఉగాది నూతన సంవత్సర పండుగ సందర్భంగా శ్రీ రామలింగేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం మరియు ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డ్ మెంబర్స్, పెద్దలు, యూత్ నాయకులు పాల్గొన్నారు



# సభ్య సమాజం తలదించుకునే ఘటన.. నిందితుడి అరెస్ట్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, వెబ్ డెస్క్:** అనకాపల్లి జిల్లాలో దారుణం జరిగింది. సభ్య సమాజం తలదించుకునే ఘటన తాజాగా వెలుగుచూసింది. ఏడేళ్ల మైనర్ బాలికపై 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డారు. చిన్నారి ఏడుపు గమనించిన కుటుంబ సభ్యులు విషయాన్ని గ్రహించేలోపే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న పోలీసులు నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం సెక్షన్లతో కేసు నమోదు చేశామని, నిందితుడికి కఠిన శిక్ష తప్పదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# రంజాన్ తోఫాను అందించిన జి.ఎమ్.ఆర్ ఫౌండేషన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, నారాయణఖేడ్ :**
నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం ఉసిరిక పల్లి గ్రామంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను జి.ఎమ్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి.ఆర్.యస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ ఆదేశాల మేరకు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఉసిరికపల్లి మాజీ ఉప సర్పంచ్ విజయ్ కుమార్, మాజీ బి ఆర్ యస్ పార్టీ ప్రెసిడెంట్ వెంకట్ రావ్, వార్డ్ మెంబర్ ఖదీర్, నారాయణఖేడ్ మున్సిపల్ 4వ వార్డు బి ఆర్ యస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్, జి యమ్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ సాగర్, అభి పవర్, శివకుమార్, నాయకులు పవన్ మోహన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి19, రాజపేట :** రాజపేట మండల కేంద్రంలోని మటం చౌరస్తాలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కోసం గురువారం రోజున భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోయ మధు, ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, నిర్వాహకులు ఎర్ర గోకుల రాజు, సట్టు నాని, ఆడెపు శ్రీశైలం, రేగు సిద్ధులు, చలమలపల్లి లక్ష్మణ్, బీర్రు సురేష్, సాధనబోయిన శంకర్, గ్రామ యువత, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రాక్స్ యూత్, జై భవాని యూత్ శివాజీ యూత్, యువ కేసరి యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దళితులను వేధిస్తే సహించేది లేదు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ చైర్మన్ భక్కి వెంకటయ్య

**దళితులపై వివక్షత చూపిస్తున్నారు**

**భక్కి వెంకటయ్యకు వినతి పత్రం అందజేసిన ఎస్సీ ఎస్టీ నాయకులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** తెలంగాణా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కి వెంకటయ్య ని ఐటీసీ పిఎస్ పిడి అతిధి గృహం నందు కలిసి ఇల్లందు ఎస్సి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేసుపాక నరేష్ కుమార్ పై టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు నరేష్ కుమార్ అను నేను దళితుడు కావడం వలన వేధింపులకు గురిచేస్తూ కులం పేరుతో ధ్వేశిస్తూ దుర్భాషలాడి బయ భ్రాంతులకు గురి చేస్తున్నారని కేసుపాక నరేష్ కుమార్ తెలియజేస్తు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం దళితులను వేదించిన అధికారుల మీద చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దళిత నాయకులు మాట్లడుతు భవిష్యత్తులో జిల్లా స్థాయిలో ఎస్సీ, ఎస్టీ అధికారులపై వేధింపులు ఈ విధంగా పునరావృతం అయితే దళిత సంఘాలు నాయకులు అందరం ఏకీకృతమై వారికి అండగా నిలుస్తామని పై స్థాయి అధికారులు వేధింపులు మానకపోతే వారికి కనువిప్పు కలిగేలా ఉద్యమిస్తామని హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఇల్లందు సాంఘిక సంక్షేమ హాస్టల్ ఎస్ డబ్ల్యూ ఓ కేసుపాక నరేష్ కుమార్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దేపంగి రమణయ్య, బి ఆర్ ఎస్ నాయకులు కేసుపాక రమణ ఐటీసీ నాయుకులు దేపంగి రామకృష్ణ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రావుల పల్లి ఈశ్వరయ్య, చల్ల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రూ.600 కోట్ల సర్కారు భూమికి విముక్తి... ఆక్రమణలు తొలగించిన హైడ్రా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, యూసఫ్ గూడ :** ఖైరతాబాద్ పరిధిలోని వెంగళ్రావు నగర్లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. మార్కెట్లో దీని విలువ సుమారు రూ.600కోట్లు ఉంటుందని అంచనా. హైడ్రా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళ్రావు నగర్ లోని 45 ఎకరాల భూమిని హౌసింగ్ బోర్డు 1975 కంటే ముందు సంబంధిత వ్యక్తులకు పరిహారం ఇచ్చి సేకరించింది. అప్పట్లో మొత్తం 660 ప్లాట్లతో లే అవుట్ వేసింది. ప్రజావసరాలకు 5 ఎకరాల స్థలాన్ని ఖాళీగా ఉంచింది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాల వరకు ఆక్రమణలు జరిగి శాశ్వత కట్టడాలు ఏర్పడ్డాయి. మిగిలిన 3 ఎకరాలను హైడ్రా కాపాడింది. ఈ స్థలంపై గతంలో హైకోర్టు స్టే ఇవ్వగా.. కొత్తగా షెడ్లు వేసి వ్యాపారాలు నిర్వహిస్తుండడం తో హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆక్రమణలను తొలగించారు.

## ఉగాది సందర్భంగా రాజపేట గ్రామపంచాయతీ వద్ద పంచాంగ శ్రవణం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి19, రాజపేట :** రాజపేట గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం రోజున సర్పంచ్ కోయ మధు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. నూతన సంవత్సరం ఉగాది శ్రీ పరాభవ నామ సంవత్సరం సందర్భంగా అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### అక్కను చంపి ముక్కలు చేసిన తమ్ముడు..

## మిస్సింగ్ కేసులో బయటపడ్డ అసలు నిజం!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, రంగారెడ్డి :** అబ్దుల్లాపూర్‌మెట్ : నమ్మిన బంధమే కాలయముడైంది. తోడబుట్టిన అక్క అని చూడకుండా ఓ తమ్ముడు అత్యంత కిరాతకానికి ఒడిగట్టాడు. ఆస్తి కోసం అక్కను హతమార్చి, మృతదేహాన్ని ముక్కలుగా నరికి చెరువులో పడేసిన ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారంలో కలకలం రేపింది.

**అసలేం జరిగింది? పోలీసుల కథనం ప్రకారం..**

రాజస్థాన్‌కు చెందిన లీలా దేవి (40), ఆమె తమ్ముడు పప్పు రామ్ కుమావత్ బాటసింగారంలో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి గ్రామంలో 120 గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశారు. అయితే, ఆ ప్లాట్ తమ్ముడి పేరు మీద రిజిస్టర్ అయి ఉంది. గత కొంతకాలంగా లీలా దేవి తన వాటా కోసం తమ్ముడిని అడుగుతోంది. దీనికి నిరాకరించిన పప్పు రామ్, అక్కను వదిలించుకోవాలని పథకం వేశాడు.

**హత్య మరియు మాయాజాలం:**

ఫిబ్రవరి 28న ఇంట్లోనే లీలా దేవిని హత్య చేసిన నిందితుడు, మార్చి 2న మృతదేహాన్ని రెండు ముక్కలుగా నరికి కార్లో తీసుకెళ్లి మజీద్‌పూర్ చెరువులో పడేశాడు. ఏమీ తెలియనట్లుగా, తన అక్క కిరాణా షాపుకు వెళ్లి కనిపించకుండా పోయిందని ఫిబ్రవరి 28న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**పోలీసుల విచారణలో నిజం నిప్పులా..**

మిస్సింగ్ కేసుగా దర్యాప్తు ప్రారంభించిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, పప్పు రామ్ ప్రవర్తనపై అనుమానంతో గట్టిగా విచారించగా అసలు విషయం బయటపడింది. ఆస్తి గొడవలే హత్యకు కారణమని తేలింది. ఈ కేసులో పప్పు రామ్‌తో పాటు అతనికి సహకరించిన రాకేష్ కుమావత్, సునీల్ కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

## రైతు సమస్యలపై ప్రభుత్వానికి హరీష్ రావు అల్టిమేటం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, మెయిన్ డెస్క్:** రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, రైతు ఉత్సవాల పేరుతో ప్రచారం మానుకొని, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కారం కాకుండా నిర్వహించే రైతు ఉత్సవాలు నిరుత్సాహ మేళాలుగా మిగిలిపోతాయని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని నర్మెట్ట గ్రామంలో రైతు మేళా సందర్భంగా ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు.రైతులకు ఇచ్చిన హామీలు, ముఖ్యంగా రుణమాఫీ, రైతు భరోసా వంటి కీలక పథకాలు అమలు కావడం లేదని ఆయన ఆరోపించారు. నర్మెట్ట గ్రామంలోనే సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, సిద్దిపేట నియోజకవర్గంలో దాదాపు రూ.300 కోట్ల రుణమాఫీ ఇంకా చెల్లించాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ మొత్తం వేల కోట్లలో ఉందని పేర్కొన్నారు.రుణమాఫీకి రూ.51 వేల కోట్లు అవసరమని అంచనా వేస్తే, బడ్జెట్లో రూ.31 వేల కోట్లకు తగ్గించి, కేవలం రూ.20 వేల కోట్లు మాత్రమే చెల్లించారని హరీష్ రావు విమర్శించారు. రైతు భరోసా నిధులు కూడా మూడు సీజన్లుగా బకాయి ఉన్నాయని, సిద్దిపేటలోనే రూ.170 కోట్లు, రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని ఆయన వెల్లడించారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. వెంటనే రైతులకు చెల్లించాల్సిన నిధులను జమచేయాలని, ఉగాది లోపు



రైతుల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### మహారాష్ట్రలో 'ఎప్‌స్టిన్ ఫైల్స్' తరహా

## ఉదంతం..జ్యోతిష్యం ముసుగులో కామకాండ!

- మహారాష్ట్రలో 'ఎప్‌స్టిన్ ఫైల్స్' తరహా కేసు సంచలనం.
- నాశిక్‌లో ఓ ప్రముఖ జ్యోతిష్యుడు జ్యోతిష్యం పేరుతో వందలాది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన కలకలం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, వెబ్ డెస్క్:** మహారాష్ట్రలోని నాశిక్ లో మరో ఎప్‌స్టిన్ ఫైల్స్ తరహా ఉదంతం బయటపడింది. ప్రముఖ జ్యోతిష్యుడు, కెప్టెన్‌గా పిలవబడే అశోక్ ఖరాత్ (67) దారుణాలు వెలుగులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేగుతోంది. ఓ 35 ఏళ్ల మహిళపై వరుసగా లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుతో నాశిక్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఉదంతం అమెరికా నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టిన్ కేసును తలపిస్తుండటంతో అతడిని 'మహారాష్ట్ర ఎప్‌స్టిన్'గా అభివర్ణిస్తున్నారు.



**అశ్లీల వీడియోల కలకలం..**

పోలీసుల విచారణలో అత్యంత భయంకరమైన విషయాలు వెలుగుచూశాయి. నిందితుడి కార్యాలయం, నివాసంపై దాడి చేసిన పోలీసులు రహస్యంగా ఎవరిక కంట పడకుండా దాచిన ఓ పెన్ డ్రైవ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో దాదాపు మహిళలకు సంబంధించి 58 అశ్లీల వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. అయితే, దొరికిన ఆ వీడియోల్లో పలువురు ప్రముఖ మహిళలు, సెలబ్రిటీలు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. జ్యోతిష్యం పేరుతో వారిని లొంగదీసుకుని, రహస్య కెమెరాల ద్వారా ఈ వీడియోలను చిత్రీకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తన 'ఓకస్ ప్రాపర్టీ డీలర్' కార్యాలయంలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి బాధితులను బ్లాక్ మెయిల్ చేయడానికి ఇతడు ఈ వీడియోలను వాడుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ వీడియోల్లో ఉన్న మహిళలు పరువు పోతుందనే భయంతో ఫిర్యాదు చేయడానికి వెనుకాడతారని భావించిన పోలీసులు, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు.

**రాజకీయ సంబంధాలు..**

అశోక్ ఖరాత్ కేవలం జ్యోతిష్యుడిగానే కాకుండా, రాజకీయ నేతలకు మార్గదర్శకుడిగా చలామణి అయ్యాడు.



పలువురు మంత్రులు, కీలక నేతలకు జ్యోతిష్యం చెబుతూ వారితో సంబంధాలు కొనసాగించాడు. ఇటీవలే కొందరు మహిళా నేతలు ఇతడి పాదపూజ చేస్తున్నట్లు ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలోనూ వైరల్ అవ్వడంతో ఈ కేసు రాజకీయంగానూ వేడెక్కింది. ఈ మేరకు అశోక్ ఖరాత్‌ను పోలీసులు అరెస్ట్ చేసి నాశిక్ కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం అతడికి 6 రోజుల పోలీస్ కస్టడీ విధించింది. ఈ కుంభకోణం గల్లీ నుంచి ఢిల్లీ వరకు వ్యాపించి ఉండవచ్చని, విచారణలో మరిన్ని షాకింగ్ నిజాలు బయటకు వస్తాయని పోలీసులు అంచనా వేస్తున్నారు.

## మెగాస్టార్ చిరంజీవి సంచలన ప్రకటన.. త్వరలో "ఉచిత విద్యా ప్రాజెక్ట్".!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, వెబ్ డెస్క్ : మెగాస్టార్ చిరంజీవి రీల్ హీరోనే కాదు రియల్ హీరో అనిపించుకుంటున్నారు. దశాబ్దాల కాలంగా చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ద్వారా లక్షలాది మందికి ప్రాణదాతగా నిలిచిన ఆయన, ఇప్పుడు సమాజంలోని మరో కీలక సమస్య అయిన పేదరికంపై పోరాడేందుకు అక్షరాయుధాన్ని ఎంచుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆయన ప్రకటించిన 'ఉచిత విద్యా ప్రాజెక్ట్' రెండు తెలుగు రాష్ట్రాల్లోని సామాన్య ప్రజల్లో, విద్యార్థుల్లో కొత్త ఆశలను చిగురింపజేసింది. ఒకప్పుడు రక్తదానం గురించి అవగాహన లేని రోజుల్లోనే ఆ ఉద్యమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లిన చిరంజీవి, ఇప్పుడు విద్య ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని బలంగా విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి గురువారం ఓ ఛానెల్ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో త్వరలోనే ఉచిత విద్యా ప్రాజెక్టును పట్టాలెక్కిస్తానని ప్రకటించారు.

**"అగరం" స్ఫూర్తితో.. ఉచిత విద్యా ప్రాజెక్ట్:**

అంతేకాదు ఈ విద్యా ప్రాజెక్ట్ వెనుక ఉన్న ప్రేరణ గురించి చిరంజీవి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తాను ప్రారంభించిన రక్తదానోద్యమాన్ని చూసి స్ఫూర్తి పొందిన తమిళ నటుడు సూర్య, తన తండ్రి శివకుమార్ పేరుతో 'అగరం ఫౌండేషన్'ను స్థాపించి వందలాది మంది పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివిస్తున్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు అదే సూర్య చేస్తున్న విద్యాదానాన్ని చూసి తాను స్ఫూర్తి పొందుతున్నానని, మంచి ఎక్కడ ఉన్నా దానిని స్వీకరించి ముందుకు సాగడమే తన లక్ష్యమని చిరంజీవి ప్రకటించడం విశేషం. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడం ద్వారా వారి కుటుంబాల భవిష్యత్తును మార్చవచ్చని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేలాది మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా, వారిని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టడమే మెగాస్టార్ ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ "ఉచిత విద్యా ప్రాజెక్ట్" ప్రకటనతో అటు సినీ పరిశ్రమలోనూ, ఇటు రాజకీయ, సామాజిక వర్గాల్లోనూ చిరంజీవిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. గతంలో ఆక్సిజన్ బ్యాంకుల ద్వారా కరోనా కష్టకాలంలో వేలాది ప్రాణాలను కాపాడిన ఆయన, ఇప్పుడు విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టడం ద్వారా తన సేవా ప్రస్థానంలో మరో మైలురాయిని అధిగమించారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు సమాచార



# జాతీయ గేయాన్ని అవమానిస్తే పట్టదా: రేవంత్ పై బండి సంజయ్ ఫైర్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉన్న వాళ్లందరినీ తొక్కుకుంటూ వెళ్లి సీఎం పదవి రేవంత్రెడ్డి తెచ్చుకున్నాడని కేంద్ర మంత్రి బండి సంజయ్కుమార్ ఆరోపించారు. కొంతమంది సీనియర్లు అసమ్మతి అంతర్గత సమావేశం జరిపితే వాళ్లను ఉద్దేశించే ముఖ్యమంత్రి హెచ్చరికలు ఇస్తున్నట్లు ఉందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే గెలిచి సీఎం పదవిలోకి వచ్చానని చెబితే అందరూ హర్షిస్తారే తప్ప ఈ తొక్కుకుంటూ పదవుల్లోకి వస్తామనడం ఏమిటో ఆయనే సమాధానం చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ సైతం తొక్కుకుంటూ వస్తున్న రేవంత్ రెడ్డిపైనే ఆధారపడి ఐదు రాష్ట్రాల ఎన్నికల బాధ్యతలను అప్పగించారని చెప్పారు. ఆ ఎన్నికల్లో సర్వేల దగ్గర నుంచి పైసలు సమకూర్చే వరకు అన్ని బాధ్యతలు రేవంత్ రెడ్డికే అప్పగించారని, సీఎం వాడుతున్న భాషను చూసి జనం అసహ్యించుకుంటున్నారని బండి సంజయ్ విమర్శించారు.

**బీఆర్ఎస్ నేతల భాష సైతం...**

బీఆర్ఎస్ నేతల భాష సైతం అట్లాగే ఉందని, రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై బీఆర్ఎస్ నేతలు నిలదీయడం లేదని, బీఆర్ఎస్ నేతల అవినీతిపై కాంగ్రెస్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. గురువారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ వందేమాతరం గేయ ఆలాపన సమయంలో అసెంబ్లీలో గవర్నర్, మండలి చైర్మన్, స్పీకర్, సీఎం, మంత్రుల సమక్షంలోనే మజ్లిస్ ఎమ్మెల్యేల బహిష్కరించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభలో సభ్యులు తప్పు చేస్తే శిక్షించే అధికారం ఒక్క స్పీకర్కు మాత్రమే ఉందని, ఇంతవరకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదని మండిపడ్డారు. దీనివల్ల శాసన వ్యవస్థపట్ల, స్పీకర్ పట్ల ప్రజల్లో మరింత చులకన భావం ఏర్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాననసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ఎందుకు స్పందించలేదని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉంటే ఎంఐఎం మెడలు పట్టి తప్పనిసరిగా వందేమాతరం ఆలపించేలా చర్యలు తీసుకునేవాళ్లమన్నారు. మజ్లిస్ మోచేతి నీళ్లు తాగే పార్టీలు అధికారంలో ఉండటంతో స్పందించడం లేదన్నారు. ఒవైసీ అప్పడప్పుడు వచ్చి దేశభక్తుడిని అని చెప్పుకోవడం కాదు. ఆచరణలో



చూపాలని, ఉగ్రవాదులను తన కాలేజీలో పెట్టుకుని దేశభక్తి మాట్లాడే ఒవైసీ మాటలను ఎవరు నమ్మరన్నారు. కరీంనగర్ ఎంపీకి ప్రాధాన్యతలేని శాఖను మోడీ కట్టబెట్టారంటూ శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు సరికాదని, హోంశాఖ చాలా కీలకమైందని తెలిపారు. అంత ప్రాధాన్యత ఉందని, కేంద్రంలో అంతటి ముఖ్యమైన శాఖను మోడీ తనకు అప్పగించారని, బీసీని ప్రధాని చేయడంతోపాటు 27 మంది ఓబీసీలకు మంత్రి పదవులిచ్చిన ఘనత బీజేపీదేనని కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖానించారు.

### వచ్చే ఏడాది ఇండియా టీంలో

# రాజపేట ఊట్కూరు యశ్వీర్ గౌడ్ కు అవకాశం





**ఛాలెంజ్ ట్రోఫీ గెలుపులో ప్రత్యేక పాత్ర పోషించిన రాజపేట యువకుడు**

**మూడు సంవత్సరాలుగా కనపరుస్తున్న ప్రత్యేక ప్రతిభ**


హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి : రాజపేట మండల కేంద్రానికి చెందిన ఊట్కూరు రాజు గౌడ్ కుమారుడు ఊట్కూరు యశ్వీర్ గౌడ్ హైదరాబాద్ క్రికెట్ టీంలో ప్రత్యేక ప్రతిభ కనభరుస్తూ గుర్తింపు పొందుతున్నాడు. అండర్ 16 అండర్ 19 విభాగాలలో మూడు సంవత్సరాల నుండి యశ్వీర్ గౌడ్ ఆడుతూ బీసీసీఐ సెలెక్ట్ బృందం దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అండర్ 19 విభాగంలో ఛాలెంజ్ ట్రోఫీ ఫర్ ఇండియా 18 లో యశ్వీర్



గౌడ్ ప్రత్యేక ప్రతిభ కనబరిచి ట్రోఫీ దక్కేందుకు కృషి చేశాడు. ప్రస్తుతం 18 సంవత్సరాల వయసున్న ఈ యువ క్రిడకారుడు తప్పకుండా వచ్చే ఏడాది ఐపీఎల్ ఇండియా టీం లో అవకాశం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

# ప్రపంచానికి ఇంటర్నెట్ లేకుండా చేస్తాం? ఇరాన్ సరికొత్త ఎత్తుగడ?

- **ఇప్పటికే చమురు సంక్షోభంతో ప్రపంచం ఉక్కిరిబిక్కిరి.**
- **తగ్గేదేలే అంటున్న ఇరాన్... వెంటాడుతున్న కొత్త భయాలు.**
- **యుద్ధం చివరకు ఎటు దారితీసేనో?**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19 :** ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో కొత్త భయాలు మొదలయ్యాయి. ఆరంభంలో ఇరాన్ పై దాడులు చేసి కీలక నేతల్ని హతమార్చి ఆ దేశంపై పట్టు సంపాదించాలని భావించిన అమెరికా-ఇజ్రాయెల్ వ్యూహం తలకిందులు కావడంతో పాటు ఇప్పుడు చమురు సంక్షోభం రూపంలో ప్రపంచ దేశాల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అయినా ఇరు దేశాలూ పంతానికి పోతుండటంతో ఇరాన్ రూటు మార్చబోతోంది. ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించి, ప్రపంచానికి ఇంధన సరఫరాను నిలిపివేసిన ఇరాన్.. ఇప్పుడు అదే మార్గంలో ఉన్న కీలకమైన సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుళ్లను కట్ చేసి అంతర్జాతీయంగా ఇంటర్నెట్ను కూడా నిలిపివేస్తుందన్న భయాలు మొదలయ్యాయి. హోర్ముజ్ జలసంధిని దిగ్బంధించినప్పటికీ, ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మండేబ్లో కూడా ఇరాన్ అనుకూల హౌతీలు దాడి చేయవచ్చనే భయాలు ఉన్నాయి. ప్రపంచంలోని డిజిటల్ జీవనాధారాలు కూడా సముద్రగర్భ కేబుళ్ల రూపంలో ఈ మార్గాల గుండానే వెళ్తాయి. దీంతో ఇప్పుడు వాటి భద్రతపై ఆందోళన మొదలైంది.

**ఇరాన్, హౌతీల చేతిలో సముద్ర కేబుల్స్?**

ఇరాన్ హోర్ముజ్ జలసంధికి అడ్డంగా సముద్ర మైన్లను అమర్చింది. దీంతో సురక్షిత మార్గాలు ఏర్పడే వరకు షిప్పింగ్ లైన్లు, బీమా కంపెనీలు తమ రాకపోకలన్నింటినీ నిలిపివేసేలా ఇరాన్ భయం కల్పించింది. మరోవైపు ఎర్ర సముద్రంలో నౌకలపై కాల్పులు జరుపుతూ యెమెన్కు చెందిన హౌతీ గ్రూపులు ఆ ఇరుకైన జలమార్గాన్ని కూడా ప్రమాదకర ప్రాంతంగా మారుస్తున్నాయి. అలాగే ఈ రెండు కీలక ప్రదేశాలు సముద్ర గర్భంలో ఫైబర్ ఆప్టిక్ కేబుళ్ల భారీ వలయానికి పైన ఉన్నాయి. ఈ సన్నని తీగలు వేల కిలోమీటర్ల మేర విస్తరించి, వీడియో కాల్స్, ఇ-మెయిల్స్ నుండి బ్యాంకింగ్ బదిలీలు మరియు ఏఐ సేవల వరకు, ప్రపంచ ఇంటర్నెట్కు శక్తినిచ్చే దాదాపు మొత్తం డేటాను మోసుకెళ్తాయి. అలా ఎర్ర సముద్రం, హోర్ముజ్ జలసంధిలో కనీసం 20 సముద్రగర్భ కేబుళ్లు ఉన్నాయి.

**ఏఐ సంస్థలకు భారీ దెబ్బ :**

అలాగే అమెజాన్, మైక్రోసాఫ్ట్ మరియు గూగుల్ వంటి పెద్ద టెక్నాలజీ సంస్థలు యూఏఈ, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలలో భారీ డేటా సెంటర్లను నిర్మించడానికి బిలియన్ల కొద్దీ పెట్టుబడులు. పెట్టాయి. ఆ ప్రాంతాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్కు తదుపరి పెద్ద కేంద్రంగా మార్చాలన్నది వారి ప్రణాళిక, సముద్రగర్భకేబుళ్లు ఈ కేంద్రాలను ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని మార్కెట్లకు, వినియోగదారులకు అనుసంధానిస్తాయి. ఇప్పుడు ఈ రెండు మార్గాలు మూసుకుపోవడంతో, మరమ్మతు పనులు దాదాపు అసాధ్యమయ్యాయి. తెగిపోయిన కేబుళ్లను సరిచేయడానికి అవసరమైన ప్రత్యేక నౌకలు ఆ



ప్రాంతంలోకి సురక్షితంగా ప్రవేశించలేవు. మైన్ దాడి లేదా ఉద్దేశపూర్వక కోత వల్ల లైన్లు వారాలు లేదా నెలల తరబడి పనిచేయకుండా పోవచ్చు.

**గతంలో అడ్డుకున్న హౌతీలు**

2024లో గాజాలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మధ్య హమాస్ కు సంఘీభావంగా హౌతీలు జరిపిన దాడుల్లో ఎర్ర సముద్రంలోని అనేక కేబుళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆసియా, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో ఇంటర్నెట్ వేగం భారీగా పడిపోయింది. ఓడలు దూరంగా ఉండటంతో పూర్తి మరమ్మతులకు నెలల సమయం పట్టింది. ఇప్పుడు ఈ రెండు కీలక మార్గాలను ఒకేసారి మూసివేయడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అంతరాయం కలిగించబోతోంది. హోర్ముజ్ జలసంధిలోని అత్యంత ఇరుకైన ప్రదేశంలో నీటి లోతు కేవలం 200 అడుగులు మాత్రమే ఉంటుంది, కాబట్టి కేబుళ్లు నిస్సారమైన నీటిలో ఉన్నాయి. ఇరాన్ కేబుళ్లను లక్ష్యంగా చేసుకుంటుందో లేదో తెలియకపోయినా, ఆ అవకాశం మాత్రం స్పష్టంగా ఉంది. ఈ నష్టం కేవలం ఫోన్లు మరియు వెబ్సైట్లకే పరిమితం కాదని, బ్యాంకులు, స్టాక్ మార్కెట్లు, ఆసుపత్రులు, ఏఐ వ్యవస్థలు అన్నీ ఈ లింకుల పై ఆధారపడి ఉన్నాయి. కాబట్టి ఇరాన్ అలా చేస్తే గల్ఫ్ దేశాలతో మొదలు పెట్టి భారత్ వరకూ చాలా దేశాలు నష్టపోతాయి.

# సీతారాంతండా లో తాగునీటి సమస్య.... పట్టించుకోని అధికారులు నారాయణఖేడ్ తీరని నీటి గోస



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 19, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ మండలం సీతారాంతండాలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గ్రామ ప్రజలు రోజూ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మహిళలు, చిన్నపిల్లలు దూర ప్రాంతాల నుండి నీరు తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన పరిష్కారం లభించలేదు. వేసవి కాలం ప్రారంభం కావడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, గ్రామానికి శాశ్వత నీటి వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# చలివేంద్రం ను ప్రారంభించిన జిల్లా బిజెపి అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, రాజపేట :** మండల కేంద్రమైన రాజపేటలో జైశ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రమును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోయ మధు, ఉప సర్పంచ్ నమిలే కేదారి గౌడ్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, చలమలపల్లి లక్ష్మణ్, దాచేపల్లి శ్రీనివాస్, చిగుళ్ల బీరయ్య, సాధన భోయిన శంకర్, సంఘశీ వేణు, గొల్లెన రవి, జన్న సిద్ధులు, ఐరేని పరుశురాం, చిన్న అవినాష్, ఫౌండేషన్ సభ్యులు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన రాజపేట కాంగ్రెస్ నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్,** మార్చి 19, రాజపేట : గురువారం రోజున యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య ను కలిసి శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు, శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో రాజపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, బొద్దుల నగేష్, కోరే మల్లయ్య తధితరులు ఉన్నారు.

హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన సంవత్సర పంచాంగ శ్రవణం




**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
మార్చి 19, రాజపేట : రాజపేట మండలం రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రోజున ఉగాది తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ అర్చక స్వాములు చక్రవర్తుల శ్రీనివాసచార్యులు సాయంకాలం ఆలయంలో స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల, భక్తుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర ఫలితంశాలు, ద్వాదశ రాశుల ఫలితాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ రాచకొండ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భోగ లక్ష్మీనారాయణ, బొద్దుల వెంకటేశం, గాడి పెల్లి శ్రవణ్ కుమార్, గుత్తికొండ సత్యనారాయణ, సామల భాస్కర్, చేన్న బాల సిద్ధులు, చింతపండు గుత్తికొండ శ్రవణ్, చింతపండు శ్రీధర్ రావు, ఏశీగల్ దాస్ నాగేష్, బెజగం లింగం, గొట్టిపాముల శ్రీనివాస్, మాచన కృష్ణ, బూరెల పాండు, చెడుదుపు లక్ష్మణ్, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మృతుని కుటుంబాన్నీ పరామర్శించిన ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్



**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
మార్చి19, రాజపేట : రాజపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన కొమ్ము మల్లయ్య మరణంతో గురువారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తు శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబాన్ని పరామర్శించారు మృతుని కుటుంబసభ్యులైన భార్య కొమ్ము భారతమ్మను, తమ్ముడు పోచయ్య ను, కుమారులు కుమార్ శ్రీకాంత్, సుమన్, సురేష్, హరీష్ లను కోడళ్లను ఓదార్చారు. సంతాప దినం సందర్భంగా కలిసిన బొందుగుల ముఖ్య నాయకులు సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉప సర్పంచ్ అబ్దుల్ ఆబిద్, గ్రామ శాఖ అధ్యక్షులు గోపగాని యాదగిరి గౌడ్, మర్ల నాగరాజు, గోళ్ళూరి ప్రభాకర్, కట్ట శంకర్, తదితరులు ఉన్నారు

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

**వాడి అనిల్, గుంటి కృష్ణ లపై కేసు నమోదు చేసిన ఎస్ఐ లింగారెడ్డి**
**పండుగ సెలవు రోజు అయినప్పటికీ విధులు నిర్వహించిన తహసిల్దార్ కు పలువురి అభినందనలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలోని వాగు నుండి గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ లింగారెడ్డి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తహసిల్దార్ వల్లపు ప్రదీప్ సమాచారం మేరకు ఎస్సై లింగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ లు టిఎస్ 30 ఎల్ 4016, టిజి 30 బి 16 22, లని అదుపులోకి తీసుకున్నారు. ఇసుకను తరలిస్తున్న వాడి అనిల్, గుంటి కిష్టయ్య లపై కేసు నమోదు చేసినట్లు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. కాగా ఉగాది పండుగ సెలవు రోజు ఉన్నప్పటికీ తహసిల్దార్ వల్లపు ప్రదీప్ విధులు నిర్వర్తించడం అభినందనీయమని రైతులు మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు. అతి తక్కువ కాలంలో తాహసిల్దార్ వల్లపు ప్రదీప్ నేతృత్వంలో పూర్తి స్థాయిలో అక్రమ ఇసుక రవాణా కట్టడిలోకి వచ్చిందని, వత్తిళ్లకు తలోగ్గకుండా అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం పట్ల మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఇక నుంచి ఆన్ లైన్ ద్వారానే ఇసుక బుకింగ్

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు**
**అక్రమ ఇసుక రవాణా పెరిగిపోయే అవకాశం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలంలో ఇసుక అనుమతి కేవలం ఆన్లైన్ ద్వారానే చేసుకోవాలని బుధవారం నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఇసుక అవసరం ఉన్న కాంట్రాక్టర్లు గృహ నిర్మాణం చేసుకునేవారు, వివిధ కట్టడాలు చేపడుతున్న వ్యక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్ట కోసం ప్రభుత్వం అమలులోకి తెస్తున్న "మన ఇసుక వాహనం" ఆదిలోనే హంస పాదు గా మారనుంది. కేవలం ఆన్లైన్ ద్వారానే ఇసుక బుకింగ్ చేసుకోవాలని నిబంధన హడావిడిగా అమలు చేయడంతో ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. కేవలం ఐదు ఏరియాలలోని వాగులలో ఇసుక అందుబాటులో ఉండగా కొత్త నిబంధనలు చికాకు తెస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాలలో ప్రభుత్వానికి సంబంధించిన సీసీ రోడ్ల ఏర్పాటు ప్రహరీ గోడల నిర్మాణం పక్కా భవనాల నిర్మాణం ప్రశ్నార్ధకంగా మారింది. ప్రభుత్వ కొత్త నిబంధనలు అక్రమ ఇసుక రవాణాకు అవకాశం కలిగించనిందని పలువురు ఆరోపిస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా నూతన సంవత్సర ఉగాది వేడుకలు

**శ్రీ పరాభవ నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు**
**ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, రాశి ఫలాలు వివరించిన చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలంలో నూతన సంవత్సరం ఉగాది వేడుకలు అన్ని గ్రామాలలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. గురువారం ఉదయం నుండి అన్ని గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. నూతన పరాభవ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, శ్రీ విశ్వా వసునామ సంవత్సరానికి ప్రజలు వీడ్కోలు పలికారు. అందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సాంప్రదాయంగా ఉగాది పచ్చడి తయారు చేసుకొని షడ్రుచుల పచ్చడి సేవించారు. ఇంటికి తోరణాలు కట్టుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. రాజపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిర ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ నూతన సంవత్సరం శ్రీ పరాభవ నామ సంవత్సర విశేషాలను రాశిఫలాలను వివరించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, పలువురు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరంలో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## బీర్ల ఫౌండేషన్ ద్వారా ముస్లిం సోదరులకు కానుక అందజేసిన కాంగ్రెస్ నాయకులు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలం రేణికుంట గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి బిర్ల పౌండేషన్ చైర్మన్ బిర్ల అనిత సహకారంతో ముస్లిం సోదరులకు రంజాన్ కానుక గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బొద్దుల నగేష్ కుమార్, మాజీ ఎంపిటిసి కోరే వీరయ్య, కోరే మల్లయ్య, వార్డ్ మెంబర్లు పోసుగొండ మధు, గొర్రె మల్లయ్య, నాగపూర్ భాస్కర్, కొక్కొండ సిద్దులు, బుడిగ నరసయ్య, కురుమ సంఘం అధ్యక్షులు పుప్పాల కుమారస్వామి, ఎర్ర పరమేష్, రావుల హరిబాబు, కోరే కృష్ణ, రంగా లక్ష్మణ్, పోసుగొండ రాములు, పోసుగొండ బాబు, బుడిగ శీను, సాయి,బొద్దుల స్వామి, రావుల హరిబాబు, బొమ్మ జనార్ధన్, పాండు పంతులు, రాంగళ్ల బాలరాజు, నక్క మల్లయ్య, దయ్యాల మల్లేష్, బండి తిరుమలేష్, ఎండి జాఫర్, బండి చంద్రయ్య, ఎర్ర కిష్టయ్య, గొర్రె మొగులయ్య, గొర్రె అంజయ్య రాంగళ్ళ మాతయ్య, ఎర్ర ఎల్లయ్య లు ఉన్నారు.

# రేణికుంటలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలం రేణికుంట గ్రామంలో అలెరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో పేదల నివాస గృహాలకు సంబంధించి 22(ఎ) సెక్షన్ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రభుత్వం పేదలకు ఇచ్చినటువంటి నివాస గృహాలు అమ్మకం మరియు కొనుగోలు చేసేలా వారికి పూర్తి హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది జిల్లాలో దాదాపు 39వేల నివాస గృహాలకు పూర్తిస్థాయి అమ్మక కొనుగోలు హక్కులు కల్పించాలని కోరడం జరిగింది. హైకోర్టు ఆదేశానుసారం ప్రభుత్వం నిషేధిత జాబితా 22(ఏ) లో చేర్చడం ద్వారా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని దీనిని ఆసరాగా చేసుకుని ప్రతిపక్ష పార్టీలు ప్రజల నివాస గృహాలు ప్రభుత్వం గుంజుకుంటుందని ఇల్లులు కూల్చివేస్తారని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సందర్భంగా రేణికుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మన రేణికుంట గ్రామంలో సుమారు 130 పైగా నివాస గృహాలు 22(ఏ) లో ఉన్నందున వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోదని, ఎవరి ఇండ్లు కూల్చివేయరని వాటిని అమ్మకము మరియు కొనుగోలులో నిషేధిత జాబితాలో మాత్రమే చేర్చారని వాటిని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇచ్చిందనీ, తమది ఇచ్చే ప్రభుత్వమే కానీ గుంజుకునే ప్రభుత్వం కాదని ప్రభుత్వం కాదని ఎవరైనా అక్రమార్కుడు ప్రభుత్వ భూమినీ ఆక్రమించినచో వాటిని మాత్రమే తీసుకుని ప్రభుత్వం రక్షిస్తుందని తెలియజేశారు ప్రతిపక్ష నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా కాకుండా వారికి ఆత్మస్థైర్యం నింపేలా ఉండాలని సూచించారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడూ న్యాయం చేస్తుందని పేదల నివాస గృహాలపై 22(ఏ) సెక్షన్ తొలగించి వారికి పూర్తిస్థాయి హక్కులు కల్పించేందుకు కృషి చేస్తుందని రేణికుంట గ్రామ ప్రజలు ఎవరూ కూడా భయపడాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ



అధ్యక్షులు బొద్దుల నగేష్ కుమార్, మాజీ ఎంపిటిసి కోరే వీరయ్య, కోరే మల్లయ్య, వార్డ్ మెంబర్లు పోసుగొండ మధు,గొర్రె మల్లయ్య, నాగపూర్ భాస్కర్, కొక్కొండ సిద్దులు, బుడిగ నరసయ్య, కురుమ సంఘం అధ్యక్షులు పుప్పాల కుమారస్వామి, ఎర్ర పరమేష్, రావుల హరిబాబు, కోరే కృష్ణ, రంగా లక్ష్మణ్, పోసుగొండ రాములు, పోసుగొండ బాబు,బుడిగ శీను, సాయి, బొద్దుల స్వామి, రావుల హరిబాబు, బొమ్మ జనార్ధన్, పాండు పంతులు, రాంగళ్ల బాలరాజు, నక్క మల్లయ్య, దయ్యాల మల్లేష్, బండి తిరుమలేష్, ఎండి జాఫర్, బండి చంద్రయ్య, ఎర్ర కిష్టయ్య , గొర్రె మొగులయ్య, గొర్రె అంజయ్య రాంగళ్ళ మాతయ్య, ఎర్ర ఎల్లయ్య తధితరులు పాల్గొన్నారు.

## బీర్ల నిలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

# పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య







**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని తన నివాసంలో (బీర్ల నిలయం) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఎమ్మెల్యే తొలుత స్వామి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన కాలమాన సూచిక అయిన పంచాంగానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సిద్ధాంతులు ఈ ఏడాది ఫలితాలను, ఆదాయ వ్యయాలను వివరించగా ఆయన ఆసక్తిగా విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ఈ 'పరాభవ' నామ సంవత్సరం (లేదా ప్రస్తుత సంవత్సర నామం) ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని, నియోజకవర్గ, జిల్లా రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో నూతన సంవత్సర సందర్భంగా దేవస్థానం అధికారులు భక్తిశ్రద్ధలతో పంచాంగాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య కి యాదగిరిగుట్ట దేవస్థానం వారు నూతన సంవత్సర అందజేసి ఆశీర్వచనం అందించారు.

## తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** భువంగిరి పట్టణం లోని శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర స్వామి ఆలయంలో భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొల్లూరి రాజు, వైస్ చైర్మన్ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జాంగిర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి, వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్ చల్లగురుగుల కృష్ణవేణి, రఘుబాబు, బొంత నరసింహ, నాకోటి నాగరాజు, భువనగిరి పట్టణ ప్రముఖులు ఆలయ భక్తులు తదితరులు పాల్గొన్నారు

## మల్లపురం శ్రీ బీరప్ప కామరాతి, మహంకాళి ఆలయంలో ఉగాది వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదగిరిగుట్ట మండలం మల్లపురం గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో స్వస్తి శ్రీ పరభావ నామ నూతన తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా శ్రీ బీరప్ప కామరాతి, మహంకాళి ఆలయముకు కురుమ సంఘం ఘనంగా ఉగాది పండుగను ఘనగా జరుపారు. ఒగ్గుకలకారులతో గుడి కి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటే లాస్య, పెద్ద కురుమ కర్రె సత్తయ్య కురుమ, కర్రె పుల్లోల మల్లేష్, సారాజి బాలరాజ్ యాదవ్, వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్, ఒగ్గు కృష్ణ, కర్రే నాగరాజు, మోటె రమేష్, కర్రె శివకుమార్, కర్రె మధు పండు, మోటే శ్రీశైలం, కర్రె పుల్లోల ఎల్లయ్య, శ్రీను, ఒగ్గు కళాకారులు ఒగ్గు లింగం, రాజు, గౌడ కరుణాకర్, మోటే శేఖర్, ఒగ్గు శ్రీకాంత్, ఉపేందర్, కర్రె లింగం, స్వామి, కర్రె చింటూ, కర్రె మధు, కురుమ సంఘం సభ్యులు పాల్గొని ఉగాది పండుగను పచ్చడి నైవేద్యం తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగినది. మల్లాపురం కురుమ సంఘం ఐక్యతగా ప్రతి ఉగాది నాడు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాము అని అన్నారు ఆ భగవంతుని కృప కటాక్షం ఈ సంవత్సరం కుడా సుఖ సంతోషాలతో ప్రజలంతా ఉండాలని కోరారు.

## బసంతపురం సర్పంచ్ మెండు రత్నమాల అధ్వర్యంలో ఉగాది వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 19, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట ఉగాది పండుగ సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉగాది వేడుకలు రాజపేట మండలం బసంతపురం గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చెసారు.

## రంజాన్ ప్రార్థనలకు ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన.....!

**- ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్**





**జహీరాబాద్ మార్చ్ 19 హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కోహిర్ పట్టణ పరిధిలోని ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలకు కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండగ పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గా దగ్గర అన్ని ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ చైర్మన్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా టెంట్లు, మంచి నీటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## వైభవంగా 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' కార్యక్రమం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025' పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 19, గురువారం సాయంత్రం హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై ప్రత్యేక శోభను తెచ్చారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి తన అర్ధాంగి సురేఖతో కలిసి హాజరుకాగా, కింగ్ నాగార్జున అమలతో విచ్చేశారు. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, నూతన దంపతులు నాగచైతన్య–శోభిత ధూళిపాళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిరంజీవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025లో విడుదలైన చిత్రాలకు గాను పలు విభాగాల్లో అవార్డులు అందించారు. "తండేల్" చిత్రానికి గాను నాగచైతన్య ఉత్తమ నటుడిగా, "ది గర్ల్ ఫ్రెండ్" చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. "రాజు వెడ్స్ రాంబాయి" ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి సాయిలు ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు, అలనాటి నటి జయసుధకు ఏఎన్నార్ ఫిల్మ్ అవార్డు అందజేశారు. సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజు వ్యాఖ్యానంతో సాగిన ఈ వేడుకలో నటి నిధి అగర్వాల్ డ్యాన్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్ డీసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమం సినీ పరిశ్రమలో నూతనోత్సాహాన్ని నింపింది.



## ఇరాన్ దాడితో ఖతార్‌కు భారీ నష్టం.. మరమ్మతులకే 5 ఏళ్లు పడుతుందన్న ఖతార్

ఇరాన్ దాడుల కారణంగా ఖతార్‌కు భారీ నష్టం సంభవించింది. ఖతార్ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన ఉత్పత్తి క్షేత్రాలపై ఇరాన్ దాడులు చేయడం వల్ల, లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ఎగుమతుల్లో 17 శాతం వరకు ఉత్పత్తి చేసే కేంద్రాలు దెబ్బతిన్నాయని ఖతార్ ఎనర్జీ సీఈవో సాద్ అల్కాబీ వెల్లడించారు. ఈ దాడి వల్ల 20 బిలియన్ డాలర్ల మేర నష్టం జరిగిందని, ఈ కేంద్రాల మరమ్మతుకు 5 ఏళ్లు పడుతుందని తెలిపారు. ఖతార్ ఇంధన ఉత్పత్తి మౌలిక సదుపాయాలపై జరిగిన దాడుల కారణంగా రాస్ లఫాన్ కేంద్రంలోని రెండు ఎల్ఎన్‌జీ ఉత్పత్తి కేంద్రాలు, ఒక గ్యాస్ టు లిక్విడ్స్ కేంద్రం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఈ దాడి వల్ల 12.8 మిలియన్ టన్నుల చమురు ఉత్పత్తి నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరప్, ఆసియాకు ఎల్ఎన్‌జీ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. ఖతార్‌లో ఇలాంటి దాడులు జరుగుతాయని అసలు ఊహించలేదని, ఖతార్ ఎనర్జీ సీఈవో అన్నారు. రంజాన్ మాసంలో తమ సోదర దేశం ఇలా చేస్తుందని అనుకోలేదని వాపోయారు. ఎల్ఎన్‌జీలకు సంబంధించి ఇటలీ, బెల్జియం, దక్షిణ కొరియా, చైనాలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై ప్రభావం పడుతుందని అన్నారు. దెబ్బతిన్న కేంద్రాల నిర్మాణానికి 26 బిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని వెల్లడించారు. ఐదేళ్ల పాటు 17 శాతం ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతిన్నట్లే అన్నారు.



# కొత్తగూడెం జిల్లాలో రూ.52 లక్షల విలువైన గంజాయి పట్టివేత

తెలంగాణ పోలీసులు రూ.52 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడు మండల కేంద్రంలో పోలీసులు భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన పలువురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో సుమారు 105.54 కిలోల గంజాయిని కార్లలో గుర్తించారు. వాహనంలో గంజాయి తరలిస్తున్నరనే పక్కా సమాచారంతో జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన తనిఖీల్లో రెండు కార్లలో గంజాయి పట్టుబడింది. టీఎస్11 ఈఆర్ 6312, టీఎస్07 జేవై 3959 అనే నెంబర్లతో కూడిన రెండు కార్లను పోలీసులు ఆపారు. ఆ కార్లలో సోదాలు చేయగా దాచి ఉంచిన 52 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కార్లలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కలిమెల, డొంకరాయి ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు పోలీసులకు తెలిపారు. ఈ గంజాయిని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలించి విక్రయించాలని ప్రయత్నించినట్లు తెలిపారు. అరెస్టైన ముగ్గురిని నల్గొండ జిల్లాకు చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్ (35), బైరెడ్డి భార్గవ్ (30), రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంకు చెందిన అందేకర్ శ్రీనివాస్ (40)లుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అభి, లక్ష్మణ్, ఫరూక్ అనే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.



హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక


## ‘ధురంధర్ 2‘ ఒక అద్భుతం.. ప్రతి భారతీయుడు గర్వపడే సినిమా..స్టేడియం దాటించేశారు: అల్లు అర్జున్

బాలీవుడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్ 2‘ చిత్రంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసల వర్షం కురిపించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని వీక్షించిన బన్నీ, తన అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. సినిమా తనను ఎంతగానో ఆకట్టుకుందని చెబుతూ అల్లు అర్జున్ తన పోస్ట్‌ను ప్రారంభించారు. దేశభక్తిని అంతర్జాతీయ స్థాయి మేకింగ్‌తో, ఎంతో స్టైలిష్‌గా చూపించిన విధానం అద్భుతంగా ఉందని కొనియాడారు. సినిమా చూస్తున్నంత సేపు తాను చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యానని పేర్కొన్నారు. ముఖ్యంగా కథానాయకుడు రణ్‌వీర్ సింగ్‌ను ‘మై బ్రదర్‘ అంటూ సంబోధించిన బన్నీ, ఆయన నటనపై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. “మన దేశంలో రణ్‌వీర్ వంటి వెర్సటైల్ నటుడు ఉండటం గర్వకారణం. ఈ సినిమాలో అతని నటన ఒక నిప్పు కణికలా ఉంది. తన ఎనర్జీతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు“ అని బన్నీ వ్యాఖ్యానించారు.దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను కూడా అల్లు అర్జున్ ప్రత్యేకంగా అభినందించారు. “ఆదిత్య ఈ సినిమాతో బంతిని స్టేడియం



దాటించేశాడు. మన దేశంలో ఇలాంటి ప్రతిభావంతులైన ఫిల్మ్ మేకర్స్ ఉండటం గర్వంగా ఉంది“ అని పేర్కొన్నారు. ‘ధురంధర్ 2‘ ఒక షో రాకర్ అని అభివర్ణించారు. సినిమాలోని సాంకేతిక అంశాలను కూడా ఆయన మెచ్చుకున్నారు. ప్రతి సన్నివేశం ఒక బ్లాస్ట్‌లా అనిపించిందని, ప్రేక్షకులు చప్పట్లు కొట్టే సందర్భాలు సినిమాలో చాలా ఉన్నాయని తెలిపారు.సీనియర్ నటుడు మాధవన్‌తో పాటు ఇతర నటీనటుల ప్రదర్శన కూడా అద్భుతంగా ఉందని బన్నీ అన్నారు. మొత్తం చిత్ర బృందానికి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ‘ధురంధర్ 2‘ ఒక స్వచ్ఛమైన భారతీయ కథ అని, ప్రతి భారతీయుడు గర్వపడేలా ఈ సినిమా ఉందని చెబుతూ, ‘జై హింద్‘ అంటూ తన పోస్ట్‌ను ముగించారు. బన్నీ చేసిన ఈ సుదీర్ఘమైన, పాజిటివ్ రివ్యూ ఇరు పరిశ్రమల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## ఆ బాధను ఎప్పటికీ మర్చిపోలేను

గత రెండేళ్లుగా తనపై వచ్చిన డ్రగ్స్ ఆరోపణలు, న్యాయపోరాటం, తాను ఎదుర్కొన్న మానసిక క్షోభపై సీనియర్ సినీ నటి హేమ భావోద్వేగంగా స్పందించారు. 2024 మే నెలలో బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీ సమీపంలోని జీఆర్ ఫామ్ హౌస్‌పై జరిగిన పోలీసు దాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ సమయంలో హేమతో పాటు పలువురు ప్రముఖుల పేర్లు ఛార్జ్ షీట్‌లో చేర్చడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. “నేను ఒక సెలబ్రిటీని కావడం వల్లే నాపై లేనిపోని ప్రచారం చేశారు. నేను ఏ తప్పూ చేయలేదని మొత్తుకున్నా ఎవరూ నమ్మలేదు. కొన్ని మీడియా సంస్థలు తనపై ఆరోపణలను హైలైట్ చేసినంతగా, నేను నిర్దోషినని కోర్టు తేల్చిన విషయాన్ని ప్రచారం చేయలేదు“ అని ఆమె విమర్శించారు.సుమారు వెయ్యి పేజీల ఛార్జ్ షీట్, నెలల తరబడి సాగిన విచారణ అనంతరం 2025 జనవరి 2న బెంగళూరు కోర్టు హేమ డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం చేస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పు తన నిజాయతీకి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఆ సమయంలో తాను అనుభవించిన మానసిక ఒత్తిడి వర్ణనాతీతమని, కేవలం కోర్టు తీర్పు తర్వాతే తనకు గౌరవం దక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు.“డ్రగ్స్ కేసులో అరెస్టయినంత మాత్రాన లేదా జైలుకు వెళ్లినంత మాత్రాన వారు నేరం చేసినట్లు కాదు. విచారణ పూర్తయి, నిజానిజాలు తేలే వరకు ఎవరినీ దోషులుగా ముద్ర వేయడం సరైంది కాదు“ అని ఆమె స్పష్టం చేశారు.

## యాక్షన్ మోడ్‌లో ఆది సాయి కుమార్..




టాలీవుడ్ యంగ్ హీరో ఆది సాయి కుమార్ తన కొత్త సినిమా టైటిల్‌ను ఉగాది పర్వదినం సందర్భంగా ప్రకటించారు. ‘ఈగో రాజా’ అనే ఆసక్తికరమైన టైటిల్‌తో రానున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. తెలుగు, తమిళ భాషల్లో ద్విభాషా చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌తో ఆది కోలీవుడ్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. ఎస్‌జిఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జి. సురేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గురు శరవణన్ దర్శకత్వం వహిస్తున్నారు.ఉగాది కానుకగా విడుదలైన ‘ఈగో రాజా’ ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఒంటిపై గాయాలు, రక్తం మరకలతో చుట్టూ రౌడీలు ఉండగా, చేతిలో సిగరెట్ పట్టుకుని ఆది సాయి కుమార్ చాలా అగ్రెసివ్ లుక్‌లో కనిపించారు. ఈ పోస్టర్‌ను బట్టి చూస్తే, సినిమాలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాలకు కొదవ ఉండదని స్పష్టమవుతోంది. యాక్షన్, ఎమోషన్, మాస్ అంశాల కలబోతగా ఈ సినిమా ఉండబోతోందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.ప్రముఖ దర్శకుడు కె.ఎస్. రవికుమార్ వద్ద దర్శకత్వ విభాగంలో పనిచేసిన గురు శరవణన్, ‘కూగల్ కుట్టప్ప’ చిత్రంతో దర్శకుడిగా మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు తన మూడో చిత్రమైన ‘ఈగో రాజా’తో హ్యాట్రిక్ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ‘శంబాల’తో మంచి విజయం అందుకున్న ఆది సాయి కుమార్, ఈ చిత్రంతో తమిళ ప్రేక్షకులను కూడా పలకరించనున్నారు. ‘కంజూరింగ్ కన్నప్పన్’, ‘సట్టం ఎన్ కైయిల్’ వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన నటుడు సతీశ్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తుండటం విశేషం. స్టార్ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస కెమెరా బాధ్యతలు చూస్తుండగా, విలక్షణ సంగీత దర్శకుడు జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. దురైరాజ్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

## అనుష్క పెళ్లి వార్తలపై ‘టీమ్ అనుష్క‘ స్పందన..

ఆమె వయసు గురించి చర్చపై ఫైర్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి వివాహం గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న వార్తలపై ఆమె వ్యక్తిగత బృందం ‘టీమ్ అనుష్క‘ తీవ్రంగా స్పందించింది. ఒక వ్యాపారవేత్తతో అనుష్క పెళ్లి ఖాయమైందంటూ వస్తున్న కథనాలను ఖండిస్తూ, మీడియా సంస్థల తీరుపై మండిపడింది. కేవలం వ్యూస్, క్లిక్స్ కోసం ఒక నటి వ్యక్తిగత జీవితాన్ని బజారున పడేయడం సరికాదని హితవు పలికింది.తాజా ప్రకటనలో టీమ్ అనుష్క ప్రధానంగా వయసు అంశాన్ని ప్రస్తావించింది. ప్రతి వార్తలోనూ అనుష్క వయసు ‘44 ఏళ్లు‘ అని ప్రత్యేకంగా హైలైట్ చేస్తూ చర్చించడాన్ని తప్పుబట్టింది. “వయసు అనేది నిజంగా చర్చించాల్సిన సమస్య అయితే, ఇదే ఉత్సాహం సీనియర్ హీరోల వయసు విషయంలో ఎందుకు కనిపించదు? కేవలం మహిళా నటీమణులనే టార్గెట్ చేయడం వివక్ష కాదా?“ అని ఘాటుగా ప్రశ్నించింది.అనుష్క తన సినీ కెరీర్‌ను కేవలం కష్టం, ప్రతిభతోనే నిర్మించుకున్నారని, ఆమె ఎప్పుడూ చీప్ పబ్లిసిటీ కోసం ప్రయత్నించలేదని టీమ్ గుర్తు చేసింది. ఒక నటిగా ఆమె సాధించిన విజయాలను పక్కన పెట్టి, కేవలం పెళ్లి, వయసు వంటి అంశాలనే హైలైట్ చేయడం అన్యాయమని పేర్కొంది. “వివాహం అనేది ఒక వ్యక్తిగత విషయం, అది బ్రేకింగ్ న్యూస్ కాదు. సోషల్ మీడియా ట్రెండ్ అసలే కాదు“ అని స్పష్టం చేస్తూ, ఆమె వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని విజ్ఞప్తి చేసింది.ప్రస్తుతం అనుష్క తన తదుపరి సినిమాలతో బిజీగా ఉన్నారని, ఆమె వివాహానికి సంబంధించిన ఏ చిన్న విషయమైనా తామే అధికారికంగా వెల్లడిస్తామని టీమ్ ప్రకటించింది. అప్పటివరకు నిరాధారమైన వార్తలను, సోషల్ మీడియా ఊహాగానాలను నమ్మవద్దని అభిమానులకు సూచించింది. సినిమా ఇండస్ట్రీలో హీరోలకు ఇచ్చే గౌరవాన్ని హీరోయిన్లకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేసిన ఈ ప్రకటన ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.